ఆదివారం
22 మార్చి 2026
సంపుటి: 02 సంచిక:360
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం

తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

ప్రపంచ వ్యాప్త

ద్రవ్యోల్బణ సెగలే..!





## రాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్

పెజెష్కియాన్‌కు రంజాన్, నౌరుజ్ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని
నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని మోదీ సూచనలు

న్యూఢిల్లీ, మార్చి 21: పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రం జాన్, నౌరు జ్ (పర్షియన్ నూతన సంవత్సరం) శుభాకాం క్షలు తెలియజేసిన ఆయన.. ఈ పర్వదినాలు పశ్చిమా సియాలో శాంతి, స్థిరత్వం తీసుకువస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాంతీయ

వివరాలు2లో..

# ఆధునిక ల్యాబ్‌తో కల్తీకి చెక్

తిరుమలలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభోత్సవం
ముఖ్యమంత్రి చంద్రబాబు
-- టిటిడి ఉన్నతాధికారులతో సమీక్ష

తిరుపతి : తిరుమలలో ఏర్పాటు చేసిన ఆధునిక ల్యాబ్‌తో కల్తీకి చెక్ పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ప్రసాదాల తయారీలో వాడే నెయ్యి, ఇతర ముడి పదార్థాల నాణ్యతను పరీక్షించేందుకు, యాత్రికులకు అత్యాధునిక ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలను తీసుకొచ్చేందుకు తిరుమలలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్ఎస్ఎఐ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఎఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడే టిటిడి ఉన్నతాధికారులతో చంద్రబాబు సమీక్షించారు. ఇటువంటి క్షేత్రాల్లో దేశంలోని తొలిసారిగా ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ దాదాపు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించారు. రూ.10 కోట్ల విలువైన

వివరాలు2లో..



## డిగో గార్సియాపై ఇరాన్ దాడి



టెహ్రాన్/వాషింగ్టన్, మార్చి 21: టెహ్రాన్ నుంచి 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న అమెరికా-బ్రిటన్ స్థావరం డిగో గార్సియాపై రెండు మధ్యశ్రేణి క్షిపణులతో దాడి చేయడానికి ఇరాన్ ప్రయత్నించింది. వాటిలో ఒకటి విఫలం కాగా, మరొకటిని అమెరికా నౌకాదళం అడ్డుకున్నది. అమెరికా, బ్రిటన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ డిగో గార్సియాపై ఈ దాడితో అమెరికాకు ఇరాన్ భారీషాక్ ఇచ్చిందిఅంతేకాదు ఇరాన్ టార్గెట్‌లో యూఎస్ అత్యంత వ్యూహాత్మక స్థావరాలు ఉండడంతోపాటు తమ సైనిక సామర్థ్యాలను ప్రపంచానికి చాటింది. తమ క్షిపణి పరిధి 2000 వేల కిలోమీటర్లు కాదని, అది నాలుగు వేల కి.మీ అని చెప్పకనే చెప్పింది. దీంతో శత్రు దేశాలే కాదు.. యావత్తు ప్రపంచం నివ్వెరపోయేలా చేసిందిఅమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న వార్ వల్ల పశ్చిమాసియా దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత ఉధృతమవుతున్నాయి. తమతమ సైనిక బలగాలను రోజురోజుకూ మోహరిస్తూ క్షిపణులు, డ్రోన్ల ద్వారా గల్ఫ్‌దేశాల్లో బాంబుల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా ఇరాన్ తన సైనిక సామ ర్థ్యాన్ని ప్రపంచానికి చాటేలా అమెరికాకు చెం దిన అత్యంత వ్యూహాత్మక స్థావరాలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది.ముఖ్యంగా హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా సైనిక స్థావరంపై ఇరాన్ రెండు మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి, యుద్ధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. అమెరికా, బ్రిటన్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ స్థావరంపై దాడియత్నం ఇరాన్ సైనిక, క్షిపణి శక్తి పరిధిని ప్రపంచానికి చాటిచెప్పింది. అమెరికా రక్షణ వర్గాల సమాచారం ప్రకారం.. ఇరాన్ ప్రయోగించిన రెండు క్షిపణులలో ఒకటి సాంకేతిక కారణాలతో మార్గమధ్యంలోనే విఫలమవ్వగా, రెండో దానిని అమెరికా నౌకాదళం తన అధునాతన ఎస్ఎమ్-3 ఇంటర్‌సెప్టర్ ద్వారా అడ్డుకుందిఈ ఎస్ఎమ్-3 క్షిపణికి ఒక ప్రత్యేకత ఉంది. ఇందులో ఎలాంటి పేలుడు

వివరాలు2లో..

## ఘనంగా రంజాన్ సంబరాలు

ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆలింగనం

: నెల రోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. స్నేహం, కరుణ, క్రమశిక్షణ, దాతృత్వానికి రంజాన్ పండుగ నిదర్శనమని పలువురు ముస్లిములు పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరం 'ఈద్ ముబారక్' అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం సోదరులకు పలువురు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. అల్లా ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కర్నూలు నగరం హిందూ-ముస్లిముల ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ముస్లిం సోదరులు తమ హిందూ స్నేహితులను ఇళ్లకు ఆహ్వానించారు. వీధివీధినా బంధుమిత్రుల సందడితో పండుగ వాతావరణం నెలకొంది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన ఈద్ ప్రార్థనలో ప్రఖ్యాత ఇస్లామిక్ పండితుడు జనాబ్ అబ్దుల్ ముస్తాన్ నద్వీ పాల్గొన్నారు. తొలుత హఫీజ్ రియాజ్ సాహెబ్ ఉర్దూ సందేశం అరబ్బీలో ఖుత్బా, నమాజ్ చేయించారు. ఇస్లాం ధర్మం పరస్పర ప్రేమానురాగాలను, సోదరభావాన్ని, ఐక్యతను చాటుతుందన్నారు. కుల, మతాలకు అతీతంగా మానవ సేవకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖలో ప్రముఖ మసీదులు, ఈద్గాల వద్దకు వందల సంఖ్యలో



ముస్లిములు చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల వద్ద చిన్నపిల్లలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ 'ఈద్ ముబారక్' చెప్పుకుంటున్న దృశ్యాలు ఆకట్టుకున్నాయి. జగదాంబ జంక్షన్, సెంట్రల్ పార్క్, అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి, హబీబ్ నగర్, మద్రిపాలెం, తాటిచెట్లపాలెం, రైల్వే న్యూ కాలనీ, భీమునిపట్నం తదితర ప్రాంతాలలో రంజాన్ ఘనంగా జరిగింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం, అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ, పోలవరం జిల్లా చింతూరు, గుంటూరు, పల్నాడు, కడప, అనంతపురం, విజయనగరం, నెల్లూరు, పలు జిల్లాల్లో ముస్లిములు ఘనంగా రంజాన్ పండుగను నిర్వహించుకున్నారు.

## భారత్‌కు భారీ ఉపశమనం

హోర్ముజ్ నుంచి ప్రయాణానికి సిద్ధమైన జగ్ వసంత, పైన్ గ్యాస్ ఎల్పీజీ నౌకలు
గల్ఫ్ ప్రాంతంలో ఇంకా భారత్ నౌకలు 22




2లో

## యుద్ధం ఆపడానికి ఆలోచిస్తున్నా..

కానీ కాల్పుల విరమణకు సిద్ధంగా లేం
మిత్ర దేశాలకు భద్రత కల్పిస్తున్నాం : ట్రంప్
హర్మూజ్ బాధ్యత తీసుకోవాలని వివిధ దేశాలకు పిలుపు



2లో

## ఇరాన్ అణుశుద్ధి కేంద్రంపై దాడి

తీవ్రంగా ఖండించిన ఇరాన్ అణు ఇంధన సంస్థ
బాధ్యతారాహిత్యమేనన్న రష్యా



2లో

## మంత్రి నారా లోకేష్ ప్రకటనతో పాత కథే పునరావృతం?

- సహాయ అధ్యాపకుల్లో ఆందోళన
- 2017-18 పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత సాధించిన వారికి నేటికీ జరగని రిక్రూట్‌మెంట్
- కొత్త నోటిఫికేషన్ పేరుతో మొత్తం పోస్టులకే ఎసరు పెడుతున్న కూటమి ప్రభుత్వం : క్వాలిఫైడ్ అభ్యర్థుల ఆవేదన



విశాఖ : దశాబ్దాలుగా విశ్వవిద్యాల యాల్లో ఖాళీగా ఉన్న సహాయ అధ్యాపక పోస్టుల భర్తీ వ్యవహారం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జాబ్ కేలండర్ విడుదల చేస్తూ 2018 మాదిరిగా 1500 సహాయ అధ్యాపకుల భర్తీ చేస్తున్నట్లు వెల్లడించడం, నోటిఫికేషన్ తేదీ కూడా మే 15న అంటూ ఖరారు చేయడంతో రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో 2017-18లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్‌లో అర్హత సాధించిన 1,300 మందిలో తీవ్ర ఆందోళన

వివరాలు2లో..

పాల ఉత్పత్తి, విక్రయదారులకు

## ఎఫ్ఎస్ఎస్ఎఐ తప్పనిసరి



2లో

## రాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్

మొదటి పేజి తరువాయి

స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాల పై దాడులను ప్రధాని మోదీ ఖండించారు.నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని.. నౌకా మార్గాలు తెరచి ఉంచడం, వాటి ని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసించారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి. మార్చి 12న ఓసారి ఫోన్ లో సంభాషించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## భారత్‌కు భారీ ఉపశమనం

టెహ్రాన్, : అత్యంత ఉద్రిక్తతలు నెలకొన్న హోర్ముజ్ జలసంధి నుంచి భారత్‌కు చెందిన రెండు ఎల్పీజీ నౌకలు జగ్ వసం త, పైన్ గ్యాస్ నౌకలు ప్రయాణానికి సిద్ధమయ్యాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యం త కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఈ రెండు ఎల్పీజీ ట్యాం కర్లు సన్నద్ధమవుతున్నాయి. గత 24 గంటలుగా ఈ మార్గంలో ముడి చమురు రవాణా పూర్తిగా నిలిచిపోయినప్పటికీ, భారత్ నౌకలు 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత' తమ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించే సూచనలు కనిపిస్తున్నాయి.ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ ప్రాంతం లో వందలాది నౌకలు నిలిచిపోయిన తరుణంలో, భారత నౌకల కదలికలు కీలకంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, సహజ వాయువులో దాదాపు 20 శాతం ఈ ఇరుకైన జలసంధి గుండానే వెళుతుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అమెరికా -ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై ఆంక్షలు విధిస్తే గల్ఫ్ నుంచి వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించడంతో ఇంధన మార్కె ట్ ఆందోళనలో ఉంది.మార్చి 18న ఒక ఖాళీ చమురు ట్యాంకర్ వెనక్కి తిరిగి వెళ్లడం ఇక్కడి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో భారత్కు చెందిన 22 నౌకలు ఉన్నాయి. వీటి సురక్షిత ప్రయాణం కోసం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తీవ్రంగా కృషి చేస్తోంది. భారత నౌకల ప్రయాణానికి ఎలాం టి ఆటంకం కలగకూడదని, సురక్షిత మార్గం ఉండాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ప్రధాని నరేం ద్ర మోదీ కూడా ఈ విషయంలో ప్రపంచ దేశాల నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

### పాల ఉత్పత్తి, విక్రయదారులకు
## ఎఫ్ఎస్ఎస్ఎఐ తప్పనిసరి

అమరావతి : రాష్ట్రంలో పాల కల్తీని అరికట్టడానికి, వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడానికి పాల వ్యాపారంలో ఉన్న వారందరూ తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) గుర్తింపు పొందాలని పశుసంవర్ధకశాఖ డైరెక్టరు టి దామోదర్ నాయుడు తెలిపారు. పాల సహకార సంఘాల సభ్యులు, పాల ఉత్పత్తిదారులు, విక్రయదారులు ఎవరైనా సరే వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ముందు ఈ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండటం తప్పనిసరి అని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల వెలుగుచూసిన పాల కల్తీ ఘటనల దృష్ట్యా పాలు, పాల ఉప ఉత్పత్తుల సేకరణ, నిల్వ విక్రయాల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, విక్రయదారుల వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేస్తారన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. పాలు, ఇతర పాల ఉత్పత్తుల విక్రయాల్లో ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని పక్షంలో తక్షణమే సమీపంలోని ఆహార భద్రతా అధికారికి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు.

### కవిత్వం విశ్వభాష- డాక్టర్ డివిజి శంకరరావు



ప్రజాస్వామ్యం ,విజయనగరం

కవిత్వం విశ్వభాష అని, మంచి కవిత్వంతో సమాజాన్ని జాగృతం చేయవచ్చునని ప్రముఖ సాహితీవేత్త, రచయిత, మాజీ పార్లమెంటు సభ్యులు డాక్టర్ డివిజి శంకరరావు పేర్కొన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతాంజలి పాఠశాలలో నిర్వహించిన కవితోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ మంచి కవిత్వం చిరస్థాయిగా ఉంటుందని అన్నారు.తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ సమాజ హితవు కోరేదే సాహిత్యమని, తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియ ఉత్కృష్టమైనదని, మంచి కవిత్వంతో మార్పు సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ముందుగా రచయిత కాగుపాటి నారాయణమూర్తి రాసిన భావ కవితా వీచికలు కవితాసంపుటిని గురు ప్రసాద్ తో కలిసి డాక్టర్ డివిజి శంకర్రావు ఆవిష్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జివి శ్రీనివాస్, డోకి చంద్రశేఖర్, దాసరి పద్మ, లింగాల నరసింగరావు, సాలూరి సంతోషి, పైడిరాజు, ముళ్లపూడి సుభద్రాదేవి తదితరులు తమ కవిత్వంతో అలరించారు. విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకులు ఆరికతోట సూర్య ప్రకాశరావు ఆంగ్లరచయితల సాహిత్యంలో గొప్పతనాన్ని వివరించారు. ఈ సమావేశంలో గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ ఎ.శ్రీనివాసరావు, డైరక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వ్యాప్త ద్రవ్యోల్బణ సెగలే..!

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగిసే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే మరింత ద్రవ్యోల్బణ అలజడకి కారణం కావచ్చని హెచ్చరించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఇంధన రంగం, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు భారత్‌పై పెద్ద ప్రభావం చూపకపోవచ్చని తప్పుడు తడకగా రిపోర్ట్ ఉండటం గమనార్హం. బ్యారెల్ చమురు ధర 110 డాలర్లు దాటడంతో భారత ఇంధనం, రవాణపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గ్యాస్ కొరతతో అనేక కంపెనీలు మూతపడుతున్నాయి. మరోవైపు యుద్ధం ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ కనిష్టం 94 చేరువలో నమోదయ్యింది. ఎగుమతులు పడిపోతున్నాయి. అయినప్పటికీ యుద్ధ ప్రభావం అంతంతే అంటూ ఎస్‌బిఐ నివేదిక పేర్కొనడం సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది.భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఏర్పడవచ్చని రిపోర్ట్ పేర్కొంది. ఒకవేళ ఈ సంఘర్షణ దీర్ఘకాలం కొనసాగితే.. ముడి చమురు ధర ప్రతీ 10 డాలర్లు పెరిగినప్పుడు.. భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 36 బేసిస్ పాయింట్లు, ద్రవ్యోల్బణం 35-40 బేసిస్ పాయింట్లు పెరిగే ప్రమాదం ఉందని నివేదిక అంచనా వేసింది."భారత్‌కు సంబంధించి ప్రధానంగా గల్ఫ్ దేశాల నుండి వచ్చే విదేశీ నగదు, ముడి చమురు దిగుమతులపై ఈ ప్రభావం స్వల్ప కాలికంగా ఉండవచ్చు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సుమారు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన హర్మ్యూజ్ నది మార్గంపై ఆధారపడటం ఇంధన భద్రత పరంగా ఒక సవాలుగా మారింది. అయితే.. భారత్ వ్యూహాత్మకంగా తన చమురు దిగుమతులను ప్రస్తుతం 40 కంటే ఎక్కువ దేశాల నుండి తీసుకుంటుంది. ముఖ్యంగా 2022 నుండి రష్యా నుండి దిగుమతులు పెరగడం మనకు రక్షణగా నిలిచింది. మరోవైపు 2025 ఆర్థిక సంవత్సరంలో భారత విదేశీ రెమిటెన్స్‌లు 15 శాతం వృద్ధితో 138 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో 38 శాతం వాటా గల్ఫ్ దేశాలదే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత విధానపరమైన నిర్ణయాలు సంక్షోభ ప్రభావాన్ని తట్టుకోవడానికి తోడ్పడతాయి." అని ఎస్‌బిఐ రీసెర్చ్ పేర్కొంది.

# యుద్ధం ఆపడానికి ఆలోచిస్తున్నా..

వాషింగ్టన్, : పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.అయితే, కాల్పుల విరమణకు మా త్రం తాను సిద్ధంగా లేనని పేర్కొన్నారు. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై తమ లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు.ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుంద న్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతర్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మ్యూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# ఇరాన్ అణుశుద్ధి కేంద్రంపై దాడి

టెహ్రాన్ మార్చి 21: ఇజ్రాయెల్- ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో యుద్ధం భీకరంగా కొనసాగుతోంది. 22వ రోజైన శనివారం కూడా క్షిపణులు, డ్రోన్లతో బాంబుల మోత మోగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై మరో సారి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా దళాలు వైమానిక దాడులు చేశాయని పేర్కొంది.అయితే, రేడియో ధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతా ల నివాసితులకు ఎలాంటి ప్రమాదమూ లేదని పేర్కొంది. ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగం గానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయని ఆగ్రహించింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పీటీ), ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన వేళ తాజా దాడులు జరగడం గమనార్హం. పెద్దగా నష్టం లేదు..యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్‌పై ఓ సారి దాడి జరిగింది. అం తర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) ఈ విషయాన్ని ధ్రువీకరించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా.. అనేక భవనాలు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండకపోవచ్చని, దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అణుశుద్ధి కేంద్రాన్ని గతేడాది సైతం అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. నంతాజ్‌పై దాడులను రష్యా కూడా తప్పు పట్టింది. వాటిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా రష్యా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి బాధ్యతారాహిత్య దాడుల వల్ల పశ్చిమాసియా అంతటా పెను విపత్తుకు దారితీసే ముప్పును కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## మంత్రి నారా లోకేష్ ప్రకటనతో పాత కథే పునరావృతం?

మొదటి పేజి తరువాయి

నెలకొంది. తాజా జాబ్ కేలండర్‌లో పేర్కొన్నట్టు కొత్త నోటిఫికేషన్ ఇస్తే 2018లో క్వాలిఫై అయిన వారిలో ఎవరో ఒకరు కోర్టుకెళ్లే అవకాశముంది. దీంతో, మొత్తం పోస్టులను ప్రభుత్వం బ్లాక్‌లో పెట్టేయాలనే కుట్ర దాగి ఉన్నట్టు పలువురు చెప్పుకుంటున్నారు. గతంలో 2017-18 మధ్య తాము నోటిఫికేషన్, జిఒ ఇచ్చి రాయించిన పరీక్ష ఇప్పుడెందుకు చెల్లదో చంద్రబాబు సర్కారు చెప్పాల్సి ఉంటుంది. వాస్తవానికి 2024లో 'కూటమి' అధికారంలోకి వచ్చాక గతంలో పరీక్ష క్వాలిఫై అయిన అభ్యర్థులంతా ఊపిరి పీల్చుకున్నారు. తమ పోస్టులు పదిలమని సంబరపడ్డారు. భర్తీ కోసం అవసరమైతే ప్రభుత్వం కోర్టులో అఫిడవిట్ వేసి గతంలో జరిగిన అన్యాయాన్ని సరిచేసి అభ్యర్థులకు ఊరట ఇస్తుందని భావించారు. కానీ సీన్ రివర్స్ అయ్యింది. మంత్రి లోకేష్ కొత్త నోటిఫికేషన్ అంటూ పాత పాటే పాడడం వారిని బాధిస్తోంది.నాడు ఏం జరిగింది ?రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో 1109 మంది సహాయ ఆచార్యులు, 185 సహాచార్యులు, 91 మంది ఆచార్యుల పోస్టుల భర్తీకి 2017లోని చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకుగానూ ఆ ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం జిఒఎంఎస్ నెంబర్ 28 నుంచి 41 వరకూ నిబంధనలను అనుసరించి 1385 అధ్యాపక ఉద్యోగాల భర్తీకి అనుమతిచ్చింది. ఎపిపిఎస్‌సి ద్వారా రిక్రూట్‌మెంట్ చెయ్యాలని భావించిన ప్రభుత్వం నోటిఫికేషన్‌ను 2018లో ఇచ్చింది. ఆ ప్రకారం జరిగిన రెండు విడతల రాత పరీక్షకు సుమారు 25 వేల మంది హాజరయ్యారు. 3,436 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. కాల్ లెటర్స్ వచ్చి 2019లో పోస్టుల్లోకి చేరాల్సిన వీరిపై రాజకీయ నీలినీడలు అలముకున్నాయి. 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వంలో కొంతమంది కోర్టులకెళ్లారు. మహిళలు, వికలాంగుల రిజర్వేషన్ల అంశం ఈ పోస్టుల భర్తీలో సక్రమంగా లేదని పేర్కొంటూ కోర్టుల్లో అఫిడవిట్‌లు దాఖలు చేశారు. దీంతో, పోస్టుల భర్తీ ఆగిపోయింది. అంతేగాక గత ప్రభుత్వంలో యూనివర్సిటీలకు చెందిన కొంతమంది అధికారులు సహాయ ఆచార్య అభ్యర్థులకు ఎపిపిఎస్‌సి కూడా భర్తీకి ఆటంకంగా మారింది. దేశంలో ఇక్కడే తొలిసారిగా ఎపిపిఎస్‌సిలో పరీక్షలు జరిగినా లేదనే తప్పుడు నివేదిక కారణంగా అర్హులైన అభ్యర్థులకు 2026 వరకూ ఉద్యోగాలు రాలేదని ఎపిపిఎస్‌సి అసిస్టెంట్ ప్రొఫెసర్ క్వాలిఫైడ్ అభ్యర్థుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రవిబాబు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. గత ప్రభుత్వ తప్పిదాలే ఈ ప్రభుత్వమూ చేస్తే భవిష్యత్తులో భారీ ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

# డిగో గార్సియాపై ఇరాన్ దాడి

మొదటి పేజి తరువాయి

పదా ర్థాలు ఉండవు. ఇది లక్ష్యాన్ని నేరుగా అత్యంత వేగంతో ఢీకొట్టి నాశనం చేసే 'హిట్-టు-కిల్' సాంకేతికతతో పనిచేస్తుంది. గంటకు 600 మైళ్ల వేగంతో ప్రయాణించే పది టన్నుల ట్రక్కు కలిగించేంతటి విధ్వంసక శక్తిని ఇది ఉత్పత్తి చేస్తుంది. ఈ దాడి ప్రయత్నం రక్షణ నిపుణులను ఆశ్చర్యానికి గురిచేసింది.ఎందుకంటే ఇరాన్ ఇప్పటివరకు తన క్షిపణి పరిధి కేవలం 2 వేల కిలోమీటర్లు మాత్రమేనని చెబుతూ వచ్చింది. కానీ, ఇరాన్ నుంచి సుమారు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న డిగో గార్సియాను లక్ష్యంగా చేసుకోవడం చూస్తుంటే.. ఆ దేశం తన నిజమైన సైనిక శక్తిని ప్రపంచానికి ఇప్పటి వరకు తెలియకుండా దాచి ఉంచిందని అర్థమవుతోంది. ఇది పశ్చి మ దేశాల భద్రతా వ్యూహాలను పునఃసమీక్షించుకునేలా చేస్తోంది. ు అవకాశం ఉన్నప్పటికీ .మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి కాల్పుల విరమణకు మొగ్గు చూపడం లేదు. చర్చలకు అవకాశం ఉన్నప్పటికీ.. యుద్ధం మధ్యలో వెనక్కి తగ్గడం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యాన్ని అడ్డుకోవడం, ఆ దేశ క్షిపణి, రక్షణ మౌలిక సదుపాయాలను పూర్తిగా నిర్వీర్యం చేయడమే తమ లక్ష్యమని ట్రంప్ ప్రకటించారు. ఇందుకోసం అమెరికా రక్షణ సంస్థలు తమ క్షిపణి ఉత్పత్తిని రెండు నుంచి నాలుగు రెట్లు పెంచుతున్నాయిఇరా న్ కూడా తన వైఖరిని కఠినతరం చేస్తూనే ఉం ది. ఒకవేళ యుద్ధం తీవ్రమైతే.. దాని ప్రభావం కేవలం మధ్య ఆసియాకే పరిమితం కాదని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శత్రువుల పర్యాటక ప్రదేశాలు, బహిరంగ స్థలాలు కూడా సురక్షి తం కాదని ఇరాన్ జనరల్ అబోల్ఫజల్ షెకర్చి హెచ్చరించారు. ఇప్పటికే కువైట్‌లోని అతిపెద్ద రిఫైనరీపై డ్రోన్ దాడులు జరగడం.. యూఏఈకి హెచ్చరికలు జారీ చేయడం చూస్తుంటే ఇరాన్ ఎంతటి సాహసానికైనా సిద్ధపడుతోందని తెలుస్తోందిబ్రిటన్ తన స్థావరాలను అమెరికాకు ఇవ్వడాన్ని కూడా ఇరాన్ తప్పుబడుతోంది. ఇక ఇరాన్ కొంత వ్యూహాత్మక వెసులుబాటును కూడా ప్రదర్శిస్తోంది. హోర్ము జ్ జలసంధి గుండా జపాన్ నౌకలను అనుమతిస్తామని చెప్పడం ద్వారా, తనకు కావాల్సిన దేశాలతో సంబంధాలను కాపాడుకుంటూనే.. అమెరికా కూటమిపై ఒత్తిడి పెంచు తోంది. అయితే, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యా హు మాత్రం ఇరాన్ సైనిక శక్తిని తాము ఇప్పటికే భారీగా దెబ్బతీశామని, వారి ఆయుధ కర్మాగారాలే తమ తదుపరి లక్ష్యమని ప్రకటించారు. హిందూ మహాసముద్రంలో అమెరికా-బ్రిటన్ వ్యూహాత్మక కీలకమైన లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలకు ఆతిథ్యం ఇస్తూ, అమెరికా శక్తి ప్రదర్శనకు ఒక కీలకమైన వేదికగా ఉంది. హిందూమహాసముద్రంలో 60 దీవుల సముదాయం చాగోస్. ఇందులో అతిపెద్దదే డిగో గార్సియా. ఆఫ్రికా, పశ్చిమాసియాలోని కార్యకలాపాల కోసం అమెరికా దీనిని ప్రధానంగా ఉపయోగిస్తుంది.

## ఆధునిక ల్యాబ్‌తో కల్తీకి చెక్

మొదటి పేజి తరువాయి

అత్యాధునిక పరికరాలు ఉన్నాయి. ఒకే నమూనాపై 50కుపైగా పరీక్షలు నిర్వహించే సామర్థ్యం ఈ ల్యాబ్‌కు ఉంది. శ్రీవారి ప్రసాదాల నాణ్యత, స్వచ్ఛతను నిర్ధారించడంతోపాటు ముడిసరుకుల్లో కల్తీని గుర్తించి, యాత్రికులకు ఉత్తమ ప్రమాణాల ప్రసాదాలు అందేలా ఈ ల్యాబ్ కీలక పాత్ర పోషించనుందని అధికారులు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ కల్తీకి ఏ మాత్రమూ ఆస్కారం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. తాను స్వయంగా యాత్రికులను కలిసినప్పుడు వారు ప్రసాదం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఆ నమ్మకాన్ని నిరంతరం కాపాడాలని ఆదేశించారు. క్యూలైన్లలో సామాన్య యాత్రికులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ఎఐ టెక్నాలజీని పూర్తి స్థాయిలో వినియోగించాలని సూచించారు. శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రమైన తిరుమల పవిత్రతను కాపాడుతూ యాత్రికుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సేవలందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. యాత్రికుల విశ్వాసాన్ని చూరగొనేలా సాంకేతికతను జోడించి అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలందించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని ఆదేశించారు. తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. టిటిడి ఆధ్వర్యాన ఐదు వేల ఆలయాల నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. టిటిడి సహా దాని పరిధిలోని 57 దేవాలయాల్లో అన్నప్రసాదం అమలు జరుగుతోందని, మరో నాలుగు దేవాలయాల్లో త్వరలోనే దీనిని ప్రారంభించబోతున్నామని సమీక్షలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. ధర్మ ప్రచారంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా రూ.750 కోట్లతో 5,000 నూతన ఆలయాల నిర్మాణం చేపడుతున్న ప్రణాళికలపై అధికారులకు కొన్ని సూచనలను చంద్రబాబు చేశారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో ఉండేలా నిర్మాణ ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇఒ ఎం.రవిచంద్ర, కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎస్పి సుబ్బరాయప్ప పాల్గొన్నారు.శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబంతన మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ముఖ్యమంత్రి హోదాలో మహా ద్వారా ప్రవేశం నుంచి నేరుగా ఆలయంలోకి వెళ్లే వెసులుబాటు ఉన్నప్పటికీ సామాన్య యాత్రికుడి మాదిరిగానే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆయన వెంట సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేష్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ఒక రోజు అన్నదానానికి అయ్యే ఖర్చు రూ.44 లక్షలను అన్నదాన ట్రస్టుకు సిఎం కుటుంబం విరాళంగా అందజేసింది.అన్నదాన కాంప్లెక్స్‌లో యాత్రికులకు స్వయంగా వడ్డనశ్రీవారి దర్శనం అనంతరం ఆలయం నుంచి కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నదాన కాంప్లెక్స్‌కు చంద్రబాబు వెళ్లారు. అక్కడ యాత్రికులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

### ముస్లిం సోదరుల ఖబరస్తాన్( సమాధి వాటిక ) ను సందర్శించిన
### ప్రహారి గోడకు సంబంధించి ఎంపీ నిధులు కేటాయించిన ఎంపీ కలిశెట్టి



విజయనగరం: (ప్రజాస్వామ్యం) పార్లమెంట్ సభ్యులు శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు గారు రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే కబరస్తాన్ ( సమాధి వాటిక )ను సందర్శించి ముస్లిం సోదరుల ఆచారాలు ప్రకారం అల్లాని ప్రార్థించి, అనంతరం కబరస్తాన్ ను మొత్తం పరిశీలించి ప్రాథమికంగా అక్కడ ఉన్నటువంటి సమస్యలు ప్రహరీ గోడ కూలిపోవడం, రాత్రిపూట లైటింగ్ లేకపోవడం వంటి సమస్యల వల్ల కలిగే ఇబ్బందులను ఎంపీ గారికి ముస్లిం సోదరులు వివరించగా గౌడు ఎంపీ గారు వెంటనే స్పందించి వారి ఎంపీ లాడ్స్ నుండి నిధులు కేటాయించడం జరిగింది. గత 20 సంవత్సరాల నుంచి కబరస్థాన్ లో ముస్లిం సోదరులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గౌరవ ఎంపీ గారు స్వయంగా ఖబరస్థాన్ ( సమాధి వాటికను )పరిశీలించి సమస్య పరిష్కారం కొరకై వెంటనే ఎంపీ నిధులు కేటాయించడం పట్ల ముస్లిం సోదరులు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు.



## ఎన్టీఆర్ డ్రాగన్ లుక్ వెనుక అసలు రహస్యం!

యంగ్ టైగర్ ఎన్టీఆర్ మరోసారి తన ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సినీ వర్గాలను, అభిమానులను ఆశ్చర్యపరిచారు. తన తాజా చిత్రం డ్రాగన్ కోసం ఆయన గణనీయంగా బరువు తగ్గి మరింత సన్నగా మారడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ లుక్ చూసిన ఫ్యాన్స్‌లో ఓ వైపు ఆశ్చర్యం, మరోవైపు ఆందోళన కనిపిస్తోంది. సోషల్ మీడియాలో ఎన్టీఆర్ బాగానే ఉన్నారా? అనే చర్చలు కూడా ఊపందుకున్నాయి. అయితే ఈ మార్పు పూర్తిగా పాత్ర కోసం చేసిన ప్రణాళికాబద్ధమైన ట్రాన్స్‌ఫర్మేషన్ అని ఆయన సన్నిహిత వర్గాలు స్పష్టం చేస్తున్నాయి7 వారాల్లోనే 10 కిలోలు తగ్గిన తారకప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా కోసం పాత్రకు తగ్గట్టుగా లీన్ ఫిజిక్ కావాలని డైరెక్టర్, ఎన్టీఆర్ ను కోరినట్లు సమాచారం. దానికి తగ్గట్టుగా ఎన్టీఆర్ కఠినమైన ఫిట్‌నెస్ రొటీన్‌ను అనుసరించి, రోజుకు సుమారు 90 నిమిషాల పాటు ఫంక్షనల్ ట్రైనింగ్ చేస్తూ, కంట్రోల్డ్ డైట్ తో కేవలం 7 వారాల్లోనే దాదాపు 10 కిలోల బరువు తగ్గినట్లు తారక్ ట్రైనింగ్ టీమ్ వెల్లడించింది. ముఖ్యంగా లో ప్రోటీన్ డైట్‌తో పాటు క్రమశిక్షణే ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌కు కారణమని వారు చెబుతున్నారు.పలుమార్లు ట్రాన్స్‌ఫర్మేషన్ చేసిన ఎన్టీఆర్ఇది ఎన్టీఆర్‌కు కొత్త విషయం కాదు. గతంలో కూడా ఆయన పలు సినిమాల కోసం తన ఫిజిక్‌ను పూర్తిగా మార్చుకున్నారు. అప్పటివరకు బొద్దుగా, లావుగా ఉన్న తారక్.. యమదొంగ కోసం స్లిమ్ లుక్‌లో కనిపించి అందరినీ ఒక్కసారిగా ఆశ్చర్యపరిచారు. ఆ తర్వాత టెంపర్ సినిమాకు సిక్స్ ప్యాక్‌తో అలరించారు. తర్వాత అరవింద సమేత వీర రాఘవ, ఆర్ఆర్ఆర్ వంటి సినిమాల కోసం కూడా తన మేకోవర్‌ను తారక్ ఎంతో విభిన్నంగా మలుచుకున్నారు. అయితే ఈసారి డ్రాగన్ కోసం చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రం గతంతో పోలిస్తే మరింత ఎక్స్‌ట్రీమ్‌గా ఉండటం గమనార్హం. ఇంత సన్నగా మారడం ఎన్టీఆర్ కెరీర్‌లో ఇదే మొదటిసారి కావడంతో ఇది ప్రత్యేక చర్చనీయాంశమైందిలుక్ కారణంగా మరింత హైప్అయితే, ఈ భారీ మార్పు సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. ఇప్పటికే భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా, ఎన్టీఆర్ లుక్ కారణంగా పాన్ ఇండియా స్థాయిలో మరింత హైప్‌ను సొంతం చేసుకుంటోంది. అభిమానులు కూడా ఈ లుక్ వెనుక కథ ఏమిటి? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో, ఆయన ఆరోగ్యం బాగానే ఉందని తెలిసినా, అభిమానులు మాత్రం జాగ్రత్తగా ఉండాలంటూ సోషల్ మీడియాలో తమ ప్రేమను వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతుండగా, ఇటీవల జోర్డాన్‌లో కీలక షెడ్యూల్ ను పూర్తి చేశారు. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్ పై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానుంది. మొత్తానికి ఫిట్‌నెస్, డెడికేషన్, ఫ్యాన్స్ ఎమోషన్... అన్నీ కలిపి ఎన్టీఆర్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

## మల్టీస్టారర్ లో మరో భామగా కయాదు లోహర్!



టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్ కోసం మరో భారీ మల్టీస్టారర్ సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోలుగా విక్టరీ వెంకటేష్..నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. ఇద్దరు చేతులు కలపడం ఇదే తొలిసారి కావడంతో? ఆ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉంటుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనీల్ కథతో పాటు ఆ కథలో పాత్ర ధారులపై దృష్టి పెట్టాడు. ఇప్పటికే వెంకటేష్‌కు జోడీగా అభినేత్రి కీర్తి సురేష్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారంఇద్దరు ఇంత వరకూ జోడీ కట్టలేదు. అనీల్ అందుకు ఛాన్స్ తీసుకున్నాడు. సీనియర్ హీరోలకు కీర్తి ఇప్పుడు పర్ఫెక్ట్ ఛాయిస్ గానూ చెప్పొచ్చు. దీంతో వెంకీ-కీర్తి మధ్య కెమిస్ట్రీ కూడా వర్కౌట్ అవుతుందని భావిస్తున్నారంతా. దీంతో కల్యాణ్ రామ్ సరసన ఛాన్స్ అందుకునే నటి ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారిన తరుణంలో ఓ క్రేజీ బ్యూటీ పేరు తెరపైకి వచ్చింది. అనీల్ అనిల్ రావిపూడి హాట్ బ్యూటీ కయాదు లోహర్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసిందికయాదు గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. -అల్లూరి- వంటి చిత్రంతో టాలీవుడ్‌కు పరిచయమైంది. అటుపై -డ్రాగన్- తో కుర్రాళ్లలో క్రేజీ బ్యూటీ మారిపోయింది. ఆ విజయం అమ్మడికి మంచి ఫాలోయింగ్ తెచ్చి పెట్టింది.దీంతో -ఫంకీ-, - ది ప్యారడైజ్- లాంటి చిత్రాల్లో ఛాన్సులందుకుంది. -ఫంకీ- నిరాశపరిచినా? ప్యారడైజ్ పై మాత్రం భారీ అంచనాలే ఉన్నాయి. ఇతర భాషల్లోనూ బిజీగా మారింది. అనీల్ ప్రాజెక్ట్ విషయానికి వస్తే? సాధారణంగా అనీల్ సినిమాల్లో హీరోయిన్లకు కూడా ప్రాధాన్యత ఉండేలా పాత్రలను డిజైన్ చేస్తాడు. ఈ మల్టీస్టారర్‌లో కయాదు లోహర్ పాత్ర చాలా రిఫ్రెషింగ్‌గా ఉంటుందని తెలుస్తోంది. కళ్యాణ్ రామ్ గంభీరమైన పాత్రకు ఈమె పాత్ర చక్కగా సెట్ అవుతుందని అనీల్ బలంగా నమ్ముతున్నాడుట. ప్రస్తుతం కయాదు లోహార్ పేరు చర్చల దశలోనే ఉందికానీ ఖరారు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోర్సెస్ ద్వారా తెలిసింది. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఈ మల్టీస్టారర్ కూడా ప్రధానంగా కామెడీ , ఫ్యామిలీ ఎమోషన్స్ చుట్టూ తిరుగుతుందని వినిపిస్తోంది.. కళ్యాణ్ రామ్ ఒక కొత్త లుక్‌లో, కాస్త ఫన్ జోనర్‌లో కనిపించబోతున్నారని టాక్. అనీల్ కు బాగా కలిసొచ్చిన జానర్ ఇది. కథ విషయంలో అనీల్ ఎప్పుడూ నేల విడిచి సాము చేయడు. పాత కథనే కొత్త ట్రీట్ మెంట్ తో చెప్పడం అలవాటు. అతడి విజయ రహస్యం కూడా అదే.

# ధురంధర్.. టాప్ ప్లేస్ కొట్టేసిందిగా..



బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్, దర్శకుడు ఆదిత్య ధర్ కాంబినేషన్ లో వచ్చిన ధురంధర్: ది రివెంజ్ సినిమా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. విడుదలకు ముందే చిత్రం రికార్డుల వేట మొదలు పెట్టింది. అడ్వాన్స్ బుకింగ్స్ లో ఓ రేంజ్ లో జోరు చూపించిన ఆ యాక్షన్ థ్రిల్లర్.. మొదటి రోజే పాత రికార్డులను బద్దలు కొట్టి రెండో రోజు కూడా అదే ఊపు కొనసాగించింది.ధురంధర్ మూవీకి వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన అన్ని సెంటర్స్ లో కూడా సూపర్ రెస్పాన్స్ వస్తోంది. ఎక్కడ చూసినా హౌస్ ఫుల్ బోర్డులే దర్శనమిస్తున్నాయి. దాదాపు నాలుగు గంటల నిడివి ఉన్నప్పటికీ ప్రేక్షకులు ఆసక్తిగా కూర్చుని సినిమా మొత్తం ఆస్వాదించడం విశేషం. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నాయి.అయితే ఓవర్సీస్ మార్కెట్ లో కూడా ధురంధర్ సీక్వెల్ తన సత్తా చాటింది. విదేశాల్లో ఆ సినిమా సుమారు 3 గంటల 55 నిమిషాల రన్ టైమ్ తో అందుబాటులోకి వచ్చింది. మొదటి భాగం కంటే ఇది కొంత ఎక్కువ నిడివి కలిగి ఉన్నప్పటికీ, అక్కడి ప్రేక్షకుల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇప్పుడు మూవీ.. ఓవర్సీస్ లో 5.20 మిలియన్ డాలర్ల ఓపెనింగ్స్ సాధించినట్లు తెలుస్తోందిదీంతో విదేశీ మార్కెట్ లో టాప్ బాలీవుడ్ ఓపెనింగ్స్ జాబితాలో మొదటి స్థానాన్ని దక్కించుకుంది ధురంధర్: ది రివెంజ్. ఇప్పటి వరకు ఆ రికార్డు సల్మాన్ ఖాన్ నటించిన టైగర్ 3 మూవీ పేరిట ఉండేది. ఆ చిత్రం విడుదల సమయంలో సుమారు 5 మిలియన్ డాలర్ల ఓపెనింగ్స్ సాధించింది. ఇప్పుడు ధురంధర్ ఆ రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించిందిఇక మూడో స్థానంలో రణబీర్ కపూర్ నటించిన యానిమల్ మూవీ.. 4.94 మిలియన్ డాలర్లతో కొనసాగుతోంది. అయితే ధురంధర్ కు సీక్వెల్ గా వచ్చిన ధురంధర్: ది రివెంజ్ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటి రణవీర్ సింగ్ నటన. ఆయన పాత్రలో చూపించిన ఎనర్జీ, ఎమోషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు దర్శకుడు ఆదిత్య ధర్ తన ప్రత్యేకమైన టేకింగ్ తో కథను ఆసక్తికరంగా మలిచారుసినిమాలో ఆర్ మాధవన్, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్ వంటి ప్రముఖ నటుల పాత్రలు కూడా బలంగా నిలిచాయి. ప్రస్తుతం థియేటర్లలో పెద్ద సినిమాల పోటీ లేకపోవడం ధురంధర్ కు కలిసొచ్చింది. వీకెండ్ కావడంతో శనివారం, ఆదివారం రోజుల్లో వసూళ్లు మరింత పెరిగే అవకాశముంది. అయితే పాన్ ఇండియా స్థాయిలో యాక్షన్ చిత్రాలకు ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను ధురంధర్ మరోసారి నిరూపించింది. ఓవర్సీస్ నుంచి దేశీయ మార్కెట్ వరకు అన్ని చోట్ల కూడా మూవీ దూసుకుపోతూ బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించే దిశగా ముందుకు సాగుతోంది.




# ఇండియన్ సినిమా ఫెంటాస్టిక్ ఫోర్!

ప్రతి ముప్పైఏళ్ల కొకసారి ట్రెండ్ మారుతూ ఉంటుంది. మేకింగ్, టేకింగ్‌లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయి. ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, కృష్ణంరాజు తరం నాటి ట్రెండ్ ఒకలా ఉంటే చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ తరం ట్రెండ్ ఒకలా ఉండి సినిమా ఇండస్ట్రీలో ఎన్నో విప్లవాత్మక మార్పుల్ని తీసుకొచ్చింది. అయితే పవన్ కల్యాణ్, మహేష్‌లు వచ్చాక ఆ మార్పులు మరింతగా పెరిగాయి. సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించాయి. అయితే భారీ మార్పులు, కోట్లల్లో బడ్జెట్‌లు మాత్రం మొదలైంది ప్రభాస్, రామ్ చరణ్, ఎన్టీఆర్ తరంలోనే.ఇండియన్ సినిమా మునుపటితో పోలిస్తే చాలా మారిపోయింది. బడ్జెట్ పరంగా, వసూళ్ల పరంగా భారతీయ సినిమా ఇప్పుడు ఊహించని స్థాయి మార్పులకు నిలువెత్తు రూపంగా కనిపిస్తోంది. బడ్జెట్‌లే కాకుండా ప్రేక్షకులని ఆశ్చర్యపరిచే స్థాయిలోనూ, వసూళ్ల పరంగానూ సరికొత్త బౌండరీస్‌ని దాటేస్తోంది. ఈ మార్పుకు ప్రధాన కారణంగా నిలిచినవి ఫెంటాస్టిక్ ఫోర్. అవే బాహుబలి 2, కేజీఎఫ్ 2, పుష్ప 2, ధురంధర్ 2.అయితే ఈ భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది మాత్రం ప్రభాస్ నటించిన -బాహుబలి 2-. బడ్జెట్, లార్జర్ దెన్ లైఫ్ మూవీస్ తీయడానికి, అలాంటి ఆలోచన కూడా చేయని రోజుల్లో మనం కూడా హాలీవుడ్ రేంజ్ సినిమాలు తీయగలమని, కోట్లల్లో వసూళ్లని రాబట్టగలమని ఈ సినిమాతో -బాహుబలి 2- టీమ్ నిరూపించి యావత్ భారతీయ సినిమాకు సరికొత్తగా నూతన జవసత్వాలని అందించి ప్రయోగాలకు, లార్జర్ దెన్ లైఫ్ సినిమాలకు సిద్ధం కండని పిలుపునిచ్చింది. ఈ సినిమా ఇచ్చిన ధైర్యంతోనే ఇప్పుడు భారీ బడ్జెట్ ఈ సినిమా ఇచ్చిన ధైర్యం వల్లే -కేజీఎఫ్ 2- తెరపైకొచ్చింది. యష్, ప్రశాంత్ నీల్ చేసిన సహసం దక్షిణాది సినిమా సత్తాల ఏంటో యావత్ భారతానికి -బాహుబలి 2- తరువాత తెలియజెప్పేలా చేసింది. మదర్ సెంటిమెంట్ నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందిన బ్లాక బస్టర్ల తరువాత దక్షిణాది నుంచి వచ్చిన భారీ యాక్షన్ డ్రామా -పుష్ప 2-. సుకుమార్ డైరెక్షన్‌లో అల్లు అర్జున్ నటించిన ఈ సినిమాకు భారీ బడ్జెట్, లార్జర్ దెన్ లైఫ్ మూవీగా తెరపైకి రావడానికి ఫస్ట్ పార్ట్ 350 కోట్లు మాత్రమే రాబడితే -కేజీఎఫ్ 2- స్ఫూర్తిగా భారీ మార్పులతో విడుదలైన -పుష్ప 2- ఎవరూ ఊహించని విధంగా రూ.1600 కోట్లకు మించి వసూళ్లని సాధించడం



### అమెజాన్ ప్రైమ్ ఈవెంట్‌లో పూజా హెగ్డే.. ఫ్యాన్ నుంచీ

## ఊహించని ప్రశ్న!

కరోనా వచ్చిన తర్వాత థియేటర్ల కంటే ఓటీటీలకే ఎక్కువ ప్రయారిటీ లభిస్తోంది. ముఖ్యంగా థియేటర్లలో సినిమాలు చూడలేని చాలామంది ఓటీటీలలో సినిమాలు చూస్తూ వాటికి మంచి రేటింగ్ కూడా అందిస్తున్నారు . ఈ క్రమంలోనే అటు ఓటిటి ప్లాట్ఫార్మ్ కూడా మంచి మంచి సినిమాలు, సీరీస్ లతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది అటు ఓటిటి దిగ్గజం నెట్ ఫ్లిక్స్ భారీ చిత్రాలు, వెబ్ సిరీస్ లను ప్రకటించగా ఇటు అమెజాన్ ప్రైమ్ వీడియో కూడా ఈ ఏడాది స్ట్రీమింగ్ కాబోయే సినిమాలు, వెబ్ సిరీస్ లను అనౌన్స్ చేసింది. ఈ మేరకు ఒక ఈవెంట్ ను కూడా నిర్వహించింది. ఇందులో చాలా మంది సెలబ్రిటీలు సందడి చేశారగతంలో మునుపెన్నడూ లేని విధంగా అతిపెద్ద కంటెంట్ స్లేట్ ను ప్రకటించింది. ప్రముఖ ఓటిటి ప్లాట్ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో ముంబైలో జరిగిన 'ప్రైమ్ వీడియో ప్రెజెంట్స్ 2026' ఈవెంట్ లో భాగంగా సుమారుగా 55 పైగా ఒరిజినల్ సిరీస్ లు, సినిమాలు, థియేటర్ మూవీస్ ను అధికారికంగా ఆవిష్కరించింది. అటు తెలుగుతోపాటు తమిళ్, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ ప్రాజెక్టులు విభిన్న జానర్లలో ప్రేక్షకులకు మంచి వినోదాన్ని పంచడానికి సిద్ధమైపోయాయిఇకపోతే ఈ ఈవెంట్ కు సెలబ్రిటీలందరూ తమ ఇన్స్టాగ్రామ్ వేదికగా హైప్ క్రియేట్ పెంచిన విషయం తెలిసిందే. ఇక ఎట్టకేలకు ఆ ఈవెంట్ కూడా ఘనంగా నిన్న జరిగింది. అయితే ఈ కార్యక్రమంలో మెరిసిన కొంతమంది తారలు అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. వారిలో పూజా హెగ్డే కూడా ఒకరు. ఇకపోతే ఇక్కడ వైట్ , లైట్ స్కై బ్లూ కలర్ కాంబినేషన్లో తన డ్రెస్ తో అందరిని ఆకట్టుకుంది. ఇకపోతే అక్కడున్న అభిమానులు, కెమెరామెన్స్ ఈమెను ఫోటోలు తీసే ప్రయత్నం చేశారు.. అయితే ఆ సమయంలో ఒక అభిమాని మిమ్మల్ని కలవాలి అని అడగగా ఆమె రండి అని పిలిచింది

EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SET-PRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP) Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022